క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



జక్కంపూడి రాజాను శాలువాతో సత్కరిస్తున్న పాలిశెట్టి సురేష్‌రాజ్

సబ్బవరం: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాను పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యాలయంలో నిర్వహించిన యువజన విభాగం సమావేశంలో పాల్గొన్న ఆయనను కలిసి, శాలువాతో సత్కరించారు. ఆయనతో పాటు పార్టీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పరిస్థితులను వారికి వివరించారు.

ఉమా చంద్రమౌళీశ్వరుడికి అభిషేకాలు



సింహాచలం: అడవివరంలోని చంద్ర గార్డెన్స్‌లో ఉన్న ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయర్‌కృష్ణశర్మ, ద్వాదశి సోదరుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

అప్పన్న సన్నిధిలో ఆర్బీఐ ఈడీ



రాధాశ్యామ్ రాథోకి అప్పన్న చిత్రపటం అందిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రిజర్వ్‌బ్యాంక్ ఇండియా(ముంబయి) ఈడీ రాధాశ్యామ్ రాథో దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరం పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అందించారు.

పీజీఆర్ఎస్‌కు ఏడు వినతులు




వినతిని పరిశీలిస్తున్న జోనల్ కార్యాలయం సిబ్బంది

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై ఏడు వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జోనల్ కమిషనర్ కె.హేమావతి ఆదేశాల మేరకు కార్యాలయ అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా దినోత్సవానికి 2 వేల మంది

సబ్బవరం: అంతర్జాతీయ యోగా డే వేడుకలకు మండలం నుంచి రెండు వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని 8 గ్రామాల నుంచి 2 వేలు మందిని తరలిస్తామన్నారు. వీరికి 200 మంది యోగా శిక్షకులు సచివాలయాలు, స్కూళ్లు, కమ్యూనిటీ హాళ్ల వద్ద శిక్షణ ఇస్తున్నారని పేర్కొన్నారు.

రెవెన్యూ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు



బీపీ పరీక్షించుకుంటున్న ఆనంద్‌కుమార్

పెందుర్తి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విజయ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. మొత్తం 60 మందికి బీపీ, షుగర్, నేత్ర వైద్య పరీక్షలు జరిపారు. ల్యాబ్ సిబ్బంది ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, ఆర్ఐ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

2 రోజుల అప్పన్న పూలతోట ముచ్చట!

- జమ్మివేట, గజేంద్రమోక్షం ఉత్సవాల సమయంలోనే శ్రద్ధ
- ఆ తర్వాత పూల తోటను పట్టించుకునే నాథుడే ఉండడు
- పూలతోటకు నీరొచ్చే మార్గం బంద్
- నిరుపయోగంగా ఫౌంటైన్లు
- పెరిగిన పిచ్చిమొక్కలు.. పట్టించుకోని అధికారులు



స్వామి కొలువుదీరే మండపం దుస్థితి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ పూల తోటకి ఎంతో ఘన చరిత్ర ఉంది. సింహగిరిపై కొలువుదీరిన స్వామికి నిత్య అలంకరణ కోసం ఇక్కడి నుంచే పుష్పాలు వెళ్తుంటాయి. కొండ దిగువనున్న గ్రామదేవతలు పైడితల్లి, బంగారమ్మతోపాటు వేంకటేశ్వరస్వామి ఆలయానికి కూడా పూలదండల్ని ఈ తోట నుంచే పంపిస్తుంటారు. ఇంతటి ఘనకీర్తి గల పూలతోటపై దేవస్థానం అధికారులు శీతకన్ను వేశారు.

సింహాద్రి అప్పన్నకు నిత్య అలంకరణ కోసం వినియోగించే పూలను అందించే వనం నిర్లక్ష్యానికి గురవుతోంది. ఏటా రెండుసార్లు స్వామి వేంచేసే రోజుల్లో మినహా మిగిలిన రోజుల్లో దాని గురించి పట్టించుకున్న పాపాన పోవట్లేదు. నీటి సరఫరా సరిపడా లేకపోవడంతో.. పూర్తి స్థాయిలో పూల సాగు సాధ్యం కావట్లేదు. దీంతో పిచ్చి మొక్కలు పెరిగి, పూదోటలోకి వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.

అలంకారప్రాయంగా ఫౌంటైన్లు

పూలతోటలో మొత్తం 12 ఫౌంటైన్లు ఉన్నాయి. అప్పట్లో ప్రతి ఫౌంటైన్ నుంచి నీరు వెదజల్లేలా ఏర్పాట్లు చేశారు. దీంతో పూలతోటకు వచ్చే భక్తులను ఇవి ఎంతగానో ఆకర్షించేవి. రాన్రాను పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరుకోవడం, నీటి సమస్య తలెత్తడంతో ప్రస్తుతం ఇవి అలంకారంగానే మిగిలాయి.



రెండు రోజులే పూలవనం..!

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఏడాదిలో రెండుసార్లు కొండ పైనుంచి దిగివచ్చి పూలతోటలోకి వేంచేస్తాడు. ఇక్కడి మండపంలో స్వామిని కొలువుంచి విజయ దశమి రోజుల్లో జమ్మివేట, కనుమ రోజు గజేంద్రమోక్షం ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆయా రోజుల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూలతోటకు తరలివస్తారు. కేవలం ఆ రెండు రోజుల్లో మాత్రమే అధికారులు మండపం ప్రాంగణాన్ని శుభ్రం చేసి, ఆ తర్వాత పట్టించుకోవట్లేదు. దీంతో మండపానికి వెళ్లే దారిలో, మండప ప్రాంగణంలో పెద్ద ఎత్తున పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి.



అప్పన్న పూలతోట వ్యూ

సరిపడా నీరు లభించక...

పూలతోటలోని పూలమొక్కలకు సరిపడా నీరు లభించట్లేదు. ఇక్కడి మొక్కలకు సింహగిరి మెట్ల మార్గంలో ఉన్న సాగిధార లేదా వర్షం నీరే ఆధారం. మొత్తం 12 మడులుగా విభజించి ఒక్కో మడిలో ఒక్కో రకం పువ్వుల మొక్కల్ని వేస్తుంటారు. ఇందుకు ప్రత్యేక సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం ఎనిమిది మడుల్లో గులాబీ, లిల్లీ, తులసి తదితర మొక్కలను వేశారు. మిగిలిన నాలుగు మడులు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి.



పూలతోటకు నీరందిస్తున్న దేవస్థానం బస్టాండ్‌లో ఉన్న మోటార్

గాల్లో కలిసిన గంటా హామీ

పూలతోటని హైదరాబాద్‌లోని ఉన్న లుంబినీ వనంలా అభివృద్ధి చేస్తామని 2014లో మంత్రి, ప్రస్తుతం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. కొండపైకి వచ్చే భక్తులు, పర్యాటకులు తప్పనిసరిగా పూలతోటను సందర్శించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇటీవల సింహగిరికి వచ్చిన ఆయన దృష్టికి ఇదే విషయాన్ని పలువురు తీసుకెళ్లారు. ఇప్పటికీ ఆయన హామీ గాలి మాటగానే మిగిలింది.



పూలతోటలో నీరు వెళ్లేందుకు ఉన్న ఇంటర్నల్ కాల్వల పరిస్థితి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పైప్‌లైన్

సింహగిరి మెట్లమార్గంలో ఉన్న సాగిధార నీరు నేరుగా పూలతోటలోకి వచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ట్రస్ట్ బోర్డు సభ్యులు దాతల సహకారంతో పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. దాని ద్వారా నీరు పూలతోటలో ఉన్న శ్రీకృష్ణ కొలనులోకి చేరేది. అక్కడి నుంచి అంతర్గత కాలువల ద్వారా మడుగుల్లోకి చేర్చి, మొక్కలకు అందించేవారు. దాని నిర్వహణను ప్రస్తుత అధికారులు పట్టించుకోకపోవడంతో శ్రీకృష్ణ కొలనులోకి నీరు చేరని పరిస్థితి. ప్రస్తుతం దేవస్థానం బస్టాండ్ గ్యారేజీలో ఉన్న బోరు నీటినే పూలతోటకు వినియోగిస్తున్నారు. ప్రత్యేకంగా పూలతోటకు ఒక బోరు అవసరం ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవట్లేదు.



సింహగిరి మెట్లమార్గం నుంచి పూలతోటకు నీరు వచ్చే పైప్‌లైన్

వాకింగ్ ట్రాక్‌ల ఊసేలేదు

పూలతోటను వుడా సహకారంతో అభివృద్ధి చేసేందుకు 2010లో ప్రణాళికలు సిద్ధం చేశారు. సందర్శకులు ప్రతి నిత్యం వచ్చేలా అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు పూనుకున్నారు. వాకింగ్ ట్రాక్ నిర్మించి, నామమాత్రపు ఎంట్రీ టికెట్ పెట్టాలనుకున్నారు. సందర్శకులు కూర్చునేందుకు కుర్చీలు, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని భావించారు. ఆ ప్రణాళిక కూడా మూలకు చేరింది.

చర్యలు తీసుకుంటాం..



పూలతోటలోకి సాగిధార నుంచి వెళ్లే పైపులైన్‌ను సరిచేస్తాం. నీరు నిరంతరం వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పూలతోటలో మూడు సార్లు బోరు తవ్వించే ఏర్పాట్లు చేశాం. నీరుపడలేదు. మళ్లీ తవ్వించేందుకు చర్యలు తీసుకుంటాం. ఆర్కిటెక్‌ల సహకారంతో ఫౌంటైన్లకి కొత్త సొగసులు చేకూర్చే ప్రణాళిక కూడా ఉంది. త్వరలోనే అమలుచేస్తాం. – రాంబాబు, ఈఈ, సింహాచలం దేవస్థానం



మండపానికి వెళ్లే మెట్లమార్గంలో మొలిచిన మొక్కలు



పూలతోటలో అడుగంటిన శ్రీకృష్ణ కొలను

పెండింగ్ వేతనాల కోసం ఉపాధి కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధి కార్మికులు

పరవాడ: ఉపాధి హామీ కార్మికుల వేతనాల బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మడకపాలెంలో ఉపాధి పనుల ప్రదేశంలో సిటు ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు 9 వారాల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలను వెంటనే చెల్లించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ వంటి సదుపాయలను కల్పించాలన్నారు. పార, తట్ట, గునపాంలకు డబ్బులతోపాటు, వేసవి అలవెన్స్‌గా 40 శాతం చెల్లించాలన్నారు. ఏడాదికి 200 రోజుల పని దినాలు, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులను వేధింపులకు గురిచేయడం మానుకోవాలన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే గుణాత్మక విద్య



వాడచీపురుపల్లిలో అవగాహన ర్యాలీలో మ్యాజిక్ బస్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

పరవాడ: మౌలిక సదుపాయలతో కూడిన ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలని మ్యాజిక్ బస్ ఆఫ్ ఇండియా ప్రతినిధి గాయత్రి పిలుపునిచ్చారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ప్లకార్డులతో గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ పెదపాటి పద్మావతి పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫాం, పుస్తకాలు, రుచికరమైన మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అర్హత కలిగిన ఉపాధ్యాయులతో గుణాత్మకమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ర్యాలీలో సంస్థ ప్రతినిధులు మండల స్వప్న, వసంత, నిర్మల, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిబంధనలు మీరితే కఠిన చర్యలు

దాబా యజమానులకు సీఐ హెచ్చరిక



దాబా నిర్వాహకులకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

పెందుర్తి: దాబాల్లో మద్యపానం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఇటీవల కాలంలో దాబాల్లో మద్యంతో పాటు బెట్టింగ్‌లు, ఇతరత్రా కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం వచ్చిన నేపథ్యంలో పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని దాబాలకు సోమవారం నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దాబాల్లో మద్యం పూర్తిగా నిషేధమన్నారు. వినియోగదారులు తెచ్చుకున్నా, నిర్వాహకులు అమ్మకాలు చేసినా చర్యలు తప్పవన్నారు. అనుమతి లేకుండా స్క్రీన్లు ఏర్పాటు చేయకూడదని, బెట్టింగ్ పూర్తిగా నిషేధమన్నారు. ప్రతి దాబాలో 30 రోజుల బ్యాకప్ కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పోలీసులు అడిగినప్పుడు తప్పనిసరిగా అందించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ నియంత్రణ మండలి మార్గదర్శకాలను అనుసరించి డీజేలు, ఇతర భారీ స్థాయి శబ్దాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. పై నిబంధనలు ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



గరుడ సేవలో అర్చకులు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం ,శేషవస్త్రాలను అందించారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

పైడితల్లి పండగకు సర్వం సిద్ధం

- నేడు అనుపు మహోత్సవం
- ఘనంగా తొలేళ్ల ఉత్సవం



సతకంపట్టు వద్ద పైడితల్లి అమ్మవారు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం జరగనుంది. దీంతో సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. కొత్త వీధిలో ఉన్న అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తులకు ఎండవేడి తగలకుండా టెంట్లు వేశారు. ఆలయ పరిసరాలతో పాటు గాంధీనగర్‌లోని అమ్మవారి సతకంపట్టు నుంచి పాత గోశాల వరకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. మంగళవారం రాత్రి జరిగే అమ్మవారి అనుపు మహోత్సవంలో పులివేషాలు, కేరళ డ్రమ్స్, తప్పెటగుళ్ల ప్రదర్శనలు దేవస్థానం ఏర్పాటు చేసింది. అమ్మవారి సతకం పట్టును పూజారి వంశీయులైన లండ కుటుంబీకులు అలంకరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లండ వెంకటరమణ ఆధ్వర్యంలో లండ కుటుంబీకులు అనుపు మహోత్సవానికి ఘటాలను సిద్ధం చేశారు.

వైఎస్సార్‌సీపీ భారీ సాంస్కృతిక కార్యక్రమాలు

పైడితల్లి పండగను పురస్కరించుకుని 98వ వార్డు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రికి పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు బోర మోహన్‌రెడ్డి, నాయకుడు లంక సత్తిబాబు ఆర్థిక సాయంతో సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటు చేస్తున్న వేదికపై జబర్దస్త్ ఫేమ్ మురళి, బషీర్, హరితేజ, ఈటీవీ ఢీ ఫేమ్ అక్షయ్, తరుణ్, సంతోష్‌లతో ప్రత్యేక కార్యక్రమాలు, విశాఖకు చెందిన కరుణ ఈవెంట్స్ డ్యాన్స్ బేబీ డ్యాన్స్, రోబో డ్యాన్స్, ఢిల్లీ బ్రదర్స్ ప్రత్యేక షో ఏర్పాటు చేస్తున్నారు.



దేవస్థానం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శన

ఘనంగా తొలేళ్ల ఉత్సవం

సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. గాంధీనగర్‌లోని అమ్మవారి సతకంపట్టు నుంచి ఘటాలను ఊరేగించారు. పాత అడవివరంలో గంటదీపాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో అమ్మవారి జోగి ఊరేగింపు జరిగింది. తొలేళ్ల ఉత్సవాన్ని పురస్కరించుకుని పుష్కరిణి సత్రం వద్ద వేదికపై ఏర్పాటు చేసిన పెందుర్తికి నిర్మల నృత్యనికేతన్, పెదగంట్యాడ నాట్య ఆరాధన సంస్థకు చెందిన కళాకారుల భరతనాట్య ప్రదర్శనాలు అలరించాయి.

మహిళ ఆచూకీ లభ్యం

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రమశక్తినగర్‌కు చెందిన మహిళ(60) ఆచూకీ లభ్యమైనట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. కాలనీకి చెందిన నర్సింగరావు అనే వ్యక్తి తన భార్య కనిపించడం లేదని ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన పోలీసులు సుజాతనగర్ ప్రాంతంలో అర్ధరాత్రి ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసుల నమోదు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వలువురిపై పోలీసులు సోమవారం కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్న సమాచారంతో సీఐ కె.వి.సతీష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ చిత్రాల ఆధారంగా నిందితులను గుర్తించారు. మూడు నెలల వ్యవధిలో మద్యం సేవిస్తున్న మొత్తం 600 మందిపై, ధూమపానం చేస్తున్న 120 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యోగాంధ్ర విజయవంతానికి ర్యాలీలు



97వ వార్డులో ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ శానాపతి వసంత



సబ్బవరం మండల పరిషత్ వద్ద ర్యాలీలో ఎంపీపీ, ఎంపీడీవో తదితరులు

పెందుర్తి: ఈ నెల 21న నగరంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం, యోగాంధ్రను విజయవంతం చేయాలని జీవీఎంసీ 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత కోరారు. వార్డులో యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించారు. వార్డు నాయకుడు శానాపతి శంకర్రావు పాల్గొన్నారు.


- జీవీఎంసీ 95వ వార్డులో కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆధ్వర్యంలో యోగాంధ్ర ర్యాలీ జరిపారు. నాయకుడు అయితా ఎర్రిబాబు పాల్గొన్నారు.

సింహాచలం: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపోలో యోగా క్లాస్ నిర్వహించారు. డిపో మేనేజర్ శరత్‌బాబు, ఉద్యోగులు, యూనియన్ల ప్రతినిధులు, గ్యారేజీ సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు.

- సింహాచలం దేవస్థానానికి చెందిన కొండదిగువ పరిపాలనా కార్యాలయంలో దేవస్థానం ఉద్యోగులకు యోగా క్లాస్ నిర్వహించారు.

సబ్బవరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి సబ్బవరం మూడు రోడ్లు కూడలి వరకూ విద్యార్థులతో కలిసి యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. 21న విశాఖలో ప్రధాన మోదీ పాల్గొనే ప్రపంచ యోగా దినోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా పిలుపునిచ్చారు. సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపీడీవో పద్మజ, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, కార్యదర్శి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు కొల్లి కృష్ణ, పల్లా తాతారావు, ఏవో శివరామప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ యువశక్తి క్యాంప్‌లో వనమహోత్సవం



వర్సిటీలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్స్

సబ్బవరం: భవిష్యత్ తరాల మనుగడ కోసం ప్రకృతి వనరులను మనమే కాపాడుకోవాలని ఎన్‌సీసీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిమ్ ప్రభాత్ అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా విశ్వవిద్యాలయం అవరణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. స్వర్ణిమ్ ప్రభాత్ ఆధ్వర్యంలో గ్రీన్‌క్లైమేట్ ఎన్‌జీవో సహకారంతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్ తన ప్రతి పుట్టిన రోజున ఓ మొక్కను నాటి, పెంచాలన్నారు. వర్సిటీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి 468 మంది క్యాడెట్స్ కోసం 468 మొక్కలను అందించిన గ్రీన్‌క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నంను అభినందించారు. రత్నం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత జీవితాన్ని అలవరచుకోవాలన్నారు. ఎన్‌సీసీ సుబేదార్ మేజర్ పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సుబేదార్ సుజన్ సింగ్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.